జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ‖సంపుటి:1 ‖ సంచిక: 95‖ ఆదివారం ‖ 30-8-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

30 ఆగస్టు 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:05 సూర్యాస్తమయం - సా. 6:27 తిథి విదియ ఉ. 9:35 వరకు తరువాత తదియ సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర తె. 3:34ం వరకు తరువాత రేవతి యోగం శూల తె. 3:41ం వరకు కరణం గరజి ఉ. 9:35 వరకు వనిజ రా. 9:14 వరకు వర్జ్యం మ. 1:19 నుండి మ. 2:55 వరకు దుర్ముహూర్తం సా. 4:49 నుండి సా. 5:38 వరకు రాహుకాలం సా. 4:55 నుండి సా. 6:27 వరకు యమగండం మ. 12:16 నుండి మ. 1:49 వరకు గుళికాకాలం మ. 3:22 నుండి సా. 4:55 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:29 నుండి తె. 5:17 వరకు అమృత ఘడియలు రా. 11:08 నుండి రా. 12:44 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:41 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



దీపిక నాజూకులకు మయూరం



## చిన్న నీటిపారుదల వ్యవస్థపై...



# కీలక నివేదిక

### ముఖ్యమంత్రికి నివేదిక అందజేసిన రైతు కమిషన్

**చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం ప్రతిపాదన.. నీటి వినియోగ సామర్థ్య పెంపుపై దృష్టి**

**పంటల మార్పిడి, ఎఫ్‌పీవోల ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి సూచనలు**

రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేసి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే దిశగా తెలంగాణ వ్యవసాయ--రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి శనివారం అందజేశారు. కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి నివేదిక సమర్పించింది.

హైదరాబాద్, ఆగస్టు 29: రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి, నీటి భద్రత, గ్రామీణ జీవనోపాధుల మెరుగుదలకు చిన్న నీటిపారుదల వ్యవస్థ పునరుద్ధరణ అత్యంత అవసరమని నివేదికలో పేర్కొన్నారు. కమిషన్ ప్రతినిధి బృందంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, భవానిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కమిషన్ చేసిన సిఫారసులపై ముఖ్యమంత్రి వారితో విస్తృతంగా చర్చించారు. వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాలను తరువాయి 2 వ పేజీలో..

# గిరిజనులకు ఇంటి వద్దే వైద్యం

### అరకులో సంజీవని కార్యక్రమం ప్రారంభం

**ఆరోగ్య రథాలకు జెండా ఊపిన సీఎం.. డిజిటల్ హెల్త్ సేవలపై ప్రత్యేక దృష్టి**

**గిరిజన ప్రాంతాలకు మెరుగైన వైద్య సదుపాయాలు.. సీఎం చంద్రబాబు**



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు మండలం గన్నెల పంచాయతీ ఆర్కే నగర్‌లో నిర్వహించిన సంజీవని కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల ప్రజలకు ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభించారు.

అరకు, ఆగస్టు 29:ఈ సందర్భంగా ఆరోగ్య సేవలను గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చేరవేసేందుకు సిద్ధం చేసిన ఆరోగ్య రథాలను జెండా ఊపి ప్రారంభించారు. సంజీవని కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు, వైద్య పరీక్షలు, తరువాయి 2 వ పేజీలో..

## తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎంకు కీలక బాధ్యత**

**రాజకీయ అనుభవానికి గుర్తింపుగా నియామకం**

**రాష్ట్రపతి ఉత్తర్వులతో నియామక ప్రకటన**

**పలువురు అభినందనలు**



న్యూఢిల్లీ, ఆగస్టు 29: ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కు మార్ రెడ్డిని తమిళనాడు గవర్న ర్‌గా నియ మించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమో దంతో ఈ నియా మకానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువ డింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కిరణ్‌కుమార్ రెడ్డికి దేశంలోని కీలక రాష్ట్రాల్లో తరువాయి 2 వ పేజీలో..



## మారిషస్‌లో తెలుగు సంస్కృతి ప్రోత్సాహానికి సహకారం

**మారిషస్ ప్రతినిధి బృందంతో భట్టి విక్రమార్క భేటీ**

**ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక బంధాల బలోపేతం**

హైదరాబాద్, ఆగస్టు 29 : మారిషస్‌లో తెలుగు భాష, సం స్కృతి, పురాణ ఇతిహాసాల ప్ర చారం, పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహ కారం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. శనివారం మ హాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో మారిషస్ పబ్లిక్ సర్వీ స్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మనారాజ్ పెం టియా నేతృత్వంలోని ప్రతినిధి బృందం తరువాయి 2 వ పేజీలో..

### భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే..

# 'భూభారతి' లక్ష్యం

**125 ఏళ్ల తర్వాత భారీ స్థాయిలో భూ సర్వే**

**తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే**

**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భూముల విషయంలో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా పారదర్శకమైన వ్యవస్థను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

సూర్యాపేట, ఆగస్టు 29: శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మంది రంలో ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబం ధించిన రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. దీని కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో భూ సరిహద్దులు, రికార్డులు, హక్కులకు సంబంధించి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితికి పరిష్కారం చూపేందుకు -2 వ పేజీలో...





## మైనారిటీల అభ్యున్నతే మోదీ ప్రభుత్వ లక్ష్యం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ప్రసంగం**

మహబూబ్‌నగర్, ఆగస్టు 29 : మైనారిటీ వర్గాల నిజమైన అభ్యున్నతి, సాధికారతకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచం దర్‌రావు అన్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బీజేపీ తరువాయి 2 వ పేజీలో..



# నేపాల్ వరదల్లో ప్రాణాలతో బయటపడి స్వదేశానికి చేరిన బాధితులు

**కొండలపైకి పరుగులు.. చెట్లెక్కి ప్రాణాలు కాపాడుకున్న వైనం.. రక్షణ చర్యలకు భారత్, నేపాల్ ప్రభుత్వాలకు కృతజ్ఞతలు**

నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదల నుంచి ప్రాణాలతో బయటపడి స్వదేశానికి చేరుకున్న భారతీయులు తమ భయానక అనుభవాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురవుతున్నారు. క్షణాల్లో విరుచుకుపడిన జలప్రళయం తమ జీవితాల్లో ఎన్నటికీ మరిచిపోలేని విషాదాన్ని మిగిల్చిందని చెబుతున్నారు.

న్యూఢిల్లీ, ఆగస్టు 29:బీహార్, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన కార్మికులు, యాత్రికులు, పర్యాటకులు సురక్షితంగా తిరిగి చేరుకున్నప్పటికీ, తమ కళ్ల ముందే జరిగిన విధ్వంసాన్ని తలచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు. బీహార్ రాష్ట్రంలోని బెట్టియాకు చెందిన వలస కార్మికులు తరువాయి 2 వ పేజీలో..

## నేటి రాశి ఫలాలు

మేషం: సంతానం కొన్ని విషయాలలో మీ మాటతో విభేదిస్తారు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు తప్పవు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు పెరుగుతాయి. ప్రారంభించిన పనులలో అవరోధాలు ఉన్నపటికీ సకాలంలో పూర్తిచేస్తారు.

వృషభం: ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు పనిచేయవు. వ్యాపార ఉద్యోగాలలో నిలకడ లోపిస్తుంది. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి.

మిధునం: పాత ఋణాలు కొంత వరకు తీరుస్తారు. ఆర్ధిక ఇబ్బందుల నుంచి బయటపడతారు. కుటుంబ సభ్యుల నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగమున సానుకూల వాతావరణం ఉంటుంది. నూతన పరిచయాల వలన ఆర్ధిక లాభాలు పొందుతారు. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిదికాదు.

కర్కాటకం: కొన్ని వ్యవహారాలలో ఇంటా బయట సమస్యలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో మాట పట్టింపులుంటాయి. ఉద్యోగమున కీలక నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. దూర ప్రాంతాల నుంచి అందిన వార్త కొంత బాధ కలిగిస్తుంది. ఆదాయం ఆశించిన విధంగా ఉండదు.

సింహం: స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో గృహమున సంతోషంగా గడుపుతారు. వ్యాపారమున అప్పుల నుంచి పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశములు అందుతాయి. ఆకస్మిక ధన లబ్ధి పొందుతారు. పెద్దల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి.

కన్య: ధన వ్యవహారాలలో లోటుపాట్లు ఉంటాయి. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. చుట్టుపక్కల వారితో ఊహించని విభేదాలు కలుగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. భాగస్వామ్య వ్యాపారాలు మందగిస్తాయి.

తుల: సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. ఆర్ధిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు ధన సహాయం లభిస్తుంది. నిరుద్యోగులకు ఉన్నత అవకాశములు లభిస్తాయి. కీలక వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సలహాలు తీసుకోవడం మంచిది. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు.

వృశ్చికం: ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. దూర ప్రాంతాల బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి గృహమున సంతోషంగా గడుపుతారు. ఉద్యోగమున ఉన్నతాధికారుల ఆదరణ పెరుగుతుంది. చేపట్టిన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

ధనస్సు: వ్యాపారాలలో నూతన ఉత్సాహంతో లాభాలు అందుకుంటారు. దైవ అనుగ్రహంతో కొన్ని పనులు పూర్తవుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: ఆర్ధిక ఇబ్బందుల వలన శిరో బాధలు పెరుగుతాయి. అకారణంగా కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగస్తులు అధికారులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. నూతన ఋణ యత్నాలు అంతగా కలిసిరావు. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చెయ్యడం మంచిది. కుటుంబ వాతావరణం మరింత చికాకు కలిగిస్తుంది.

కుంభం: సమర్ధవంతంగా నిర్వహించి లాభాలు పొందుతారు. ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది. గృహ నిర్మాణ ఆలోచనలు ఆచరణలో పెడతారు. వ్యాపారము నూతన మిత్రులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్ధిక పరిస్థితి అనుకూలిస్తుంది. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు.

మీనం: సన్నిహితుల సహాయ సహకారములతో నూతన కార్యక్రమములు ప్రారంభిస్తారు. ఇంటా బయట శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. నూతన వ్యాపారాలు విజయవంతంగా సాగుతాయి. ఆర్ధిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి. నిరుద్యోగులకు అప్రయత్నంగా నూతన అవకాశాలు అందుతాయి.



# చిన్న నీటిపారుదల వ్యవస్థపై కీలక నివేదిక

మొదటి పేజీ తరువాయి

ప్రోత్సహించడంతో పాటు ఉద్యానవన పంటల సాగును పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీవోలు) ఏర్పా టుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. చిన్న నీటిపారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానించి నీటి వినియోగాన్ని సమగ్రంగా నిర్వహించే విధానాలను అమలు చేయాలని పేర్కొంది. ఈ చర్యల ద్వారా సాగునీటి వినియోగం మెరుగుపడి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని అభిప్రాయపడింది. రాష్ట్రంలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) సరిహద్దులను తక్షణం గుర్తించి, ఆక్రమణలను తొలగించి వాటిని సంరక్షించాలని సూచించింది. చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని నివేదికలో వివరించింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువులు కీలక పాత్ర పోషిస్తున్నాయని కమిషన్ పేర్కొంది. చెరువుల ఆధారిత వ్యవసాయాన్ని బలోపేతం చేయడం ద్వారా రైతుల ఆదాయం పెరగడమే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా కొంతవరకు తగ్గించవచ్చని అభిప్రాయపడింది. నీటి వనరుల సంరక్షణను



దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహంలో భాగంగా చూడాలని సూచించింది. గత రెండేళ్లలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సిఫారసులను ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కమిషన్ అందిస్తున్న సూచనలను సీఎం అభినందించారు. కమిషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, రైతుల ప్రయోజనాల దృష్ట్యా మరిన్ని ఆచరణాత్మక సూచనలు అందించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం, కమిషన్ సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు సమావేశంలో వెల్లడైంది.

## ..సంస్కృతి ప్రోత్సాహానికి సహకారం

మొదటి పేజీ తరువాయి

ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ--మారిషస్ మధ్య సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రజల మధ్య ఉన్న స్నేహపూర్వక బంధాలు ఇరు ప్రాంతాలను మరింత దగ్గర చేశాయని అన్నారు. ముఖ్యంగా తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల ద్వారా తెలంగాణకు మారిషస్‌తో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని వివరించారు.

మారిషస్‌లో నివసిస్తున్న తెలుగు సమాజం అక్కడి బహుళ సాంస్కృతిక సమాజంలో కీలక పాత్ర పోషిస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలుగు భాష, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు అక్కడి తెలుగు సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలతో సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. మారిషస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న రామ భజనం కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్య, సాంస్కృతిక పరిశోధన, కళలు, భాషాభివృద్ధి, వారసత్వ పరిరక్షణ వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా మారిషస్ మంత్రి లచ్మునారాజ్ పెంటియా మాట్లాడుతూ మారిషస్‌లోని తెలుగు కల్చరల్ సెంటర్ ద్వారా లక్షలాది మంది తెలుగు ప్రవాసులు తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటున్నారని చెప్పారు. తెలుగు వారసత్వాన్ని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారం తమకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాష, సంస్కృతిని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మారిషస్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. తెలుగు ప్రవాసుల అభ్యున్నతి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది. ఈ భేటీతో తెలంగాణ--మారిషస్ మధ్య సాంస్కృతిక, విద్యా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఇరు పక్షాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## నేపాల్ వరదల్లో ప్రాణాలతో బయటపడి స్వదేశానికి చేరిన బాధితులు

మొదటి పేజీ తరువాయి

వరదలను "ఊహించలేని ప్రళయం"గా అభివర్ణించారు. ఒక్కసారిగా సుమారు 20 అడుగుల ఎత్తులో నీరు ఉప్పొంగి రావడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు పిల్లలను వెంటబెట్టుకుని కొండలపైకి పరుగులు తీయాల్సి వచ్చిందని తెలిపారు. తమతో కలిసి పనిచేస్తున్న ముగ్గురు సహచరులు వరదల్లో గల్లంతయ్యారని, నీరు తగ్గిన తర్వాత వెతికినా వారి జాడ దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి వరద ముప్పు ఉందన్న హెచ్చరికలతో అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాల్సి వచ్చిందని చెప్పారు.

మరో బాధితుడు ఉదయం భారీ శబ్దం విని బయటకు వచ్చేసరికి చుట్టుపక్కల ప్రాంతమంతా ధూళితో కమ్ముకుపోయిందని వివరించాడు. కొద్ది క్షణాల్లోనే వరద నీరు అన్ని వైపుల నుంచి ముంచెత్తడంతో ఎత్తైన ప్రాంతాలకు పరుగులు తీశామని చెప్పాడు. తర్వాత తిరిగి వచ్చి చూసేసరికి ఇళ్లు, వాహనాలు, మనుషులు ఏవీ కనిపించలేదని, అంతా కొట్టుకుపోయిందని వేదన వ్యక్తం చేశాడు. ఆ దృశ్యాలు ఇప్పటికీ కళ్లముందు కదలాడుతున్నాయని తెలిపాడు. కైలాస్ మానస సరోవర్ యాత్రకు వెళ్లిన చెన్నైకి చెందిన ఓ మహిళ కూడా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. ఆమె కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, చైనా-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో బస్సులో ప్రయాణిస్తుండగా వరదలు సంభవించాయి. పరిస్థితి అదుపు తప్పడంతో డ్రైవర్ బస్సును వదిలి పారిపోగా, ప్రయాణికులంతా ప్రాణాల కోసం పరుగులు తీశారు. ఆ మహిళ సమీపంలోని ఓ చెట్టు ఎక్కి మూడు నుంచి నాలుగు గంటల పాటు అక్కడే గడిపారని, అనంతరం నేపాల్ సైన్యం ఆమెను సురక్షితంగా రక్షించిందని తెలిపారు. మహారాష్ట్రకు చెందిన పర్యాటకులు కూడా ఈ విపత్తు సమయంలో తీవ్ర ఆందోళనకు గురయ్యామని చెప్పారు.

## మైనారిటీల అభ్యున్నతే మోదీ ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. మైనారిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ సూచించిన "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్" సిద్ధాంతం ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని రామచందర్‌రావు పేర్కొన్నారు. దేశంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధి ఫలాలు అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంద న్నారు. మైనారిటీ వర్గాల విద్య, ఉపాధి, ఆర్థిక పురోగతికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే మోదీ ప్రభుత్వం మాత్రం సంక్షేమం, అభివృద్ధి, సాధికారత అనే మూడు అంశాలపై దృష్టి సారించి పనిచేస్తోందని పేర్కొన్నారు. మైనారిటీ యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందని రామచందర్‌రావు వివరించారు. మహిళల సాధికారత, విద్యా ప్రోత్సాహం, సామాజిక భద్రత రంగాల్లో కూడా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ చర్యల వల్ల మైనారిటీ వర్గాల్లో విశ్వాసం పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేయడంలో మైనారిటీ మోర్చా కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని, పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ విస్తరణకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, మైనారిటీ మోర్చా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, మైనారిటీ వర్గాల్లో పార్టీ విస్తరణపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.

## గిరిజనులకు ఇంటి వద్దే వైద్యం

మొదటి పేజీ తరువాయి

మందుల పంపిణీ, ఆరోగ్య సలహాలు అందించనున్నారు. దూర ప్రాంతాల ప్రజలు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, వారి వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సంజీవని కార్యక్రమం కింద డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించుకున్న ఓ గర్భిణితో పాటు మొత్తం 30 మంది లబ్ధిదారులతో ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడారు. ఆరోగ్య సేవల నాణ్యత, అందుతున్న వైద్య సదుపాయాలు, ఎదురవుతున్న సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.

డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా ప్రతి వ్యక్తి ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా భద్రపరచడం వల్ల మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని ఆధునికీకరించేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు అమలు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. సాంకేతికతను వినియోగించి గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు.

గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించడంలో సంజీవని కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు. ఆరోగ్య రథాల ద్వారా వైద్య బృందాలు గ్రామాలకు చేరుకుని పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు అందజేస్తాయని వివరించారు. డిజిటల్ ఆరోగ్య రికార్డుల వల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఉంటుందని చెప్పారు. అరకు వంటి గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సంజీవని కార్యక్రమం గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల అందుబాటును మరింత మెరుగుపరుస్తుందని, రాష్ట్ర ఆరోగ్య రంగంలో ఇది ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఒకటైన తమిళనాడుకు గవర్నర్ బాధ్యతలు అప్పగించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చివరి ముఖ్యమంత్రిగా సేవలందించారు. శాసనసభ స్పీకర్‌గా, మంత్రిగా, ఎమ్మెల్యేగా వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయనకు పరిపాలనా వ్యవహారాలపై విస్తృత అనుభవం ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ముఖ్యమంత్రిగా కీలక పరిణామాలను ఎదుర్కొన్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గవర్నర్‌గా రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉండగా, కేంద్రం ఆయన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, శాసనసభ, రాజ్‌భవన్ మధ్య సమన్వయం సాధించడంలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి నియామకాన్ని పలువురు రాజకీయ నాయకులు స్వాగతించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన ఆయనకు గవర్నర్ పదవి దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయనకు ఉన్న అనుభవం తమిళనాడు రాష్ట్రానికి ఉపయోగపడుతుందని అభినందనలు తెలియజేశారు.

## 'భూభారతి' లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సూచనలు, ఆలోచనల మేరకు తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో భూ సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. వివిధ జిల్లాల్లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షలు నిర్వహించి వివరాలు తెలుసుకుంటున్నామని చెప్పారు. సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించే అధికారులపై అవసరమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇండ్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇండ్లు ఇచ్చినట్లు చెప్పారు. తొలి విడతలో మంజూరైన ఇండ్లకు సంబంధించి ఎల్-1, ఎల్-2, ఎల్-3 దశల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా ఎల్-3 సమస్యలకు ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

శ్వేత

## సంపాదకీయం

ఆదివారం 30-8-2026

# నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు!

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పుడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే. ఈ క్రమంలో తొలుత బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు.

భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక పక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు.

మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఎ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి పక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.



# నేపాల్‌లో మృత్యుంజయులు

**చనిపోయారనుకున్న ఇద్దరు తనయులు రాక.. కన్నీటి పర్యంత నుంచి తేరుకున్న తల్లి ఆనందబాష్పాలు**

ఖాఠ్మండ్,ఆగస్ట్29(ఆర్ఎన్ఎ): నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదలకు 616 మంది మృతిచెందగా, సుమారు 2,500 మంది గల్లంతయ్యారు. ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. ఎన్నో కుటుంబాలు తమ వారిని కోల్పోయి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. ఇదే సమయంలో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. రెండు రోజుల తర్వాత వారిద్దరూ ప్రాణాలతోనే ఉన్నారని తెలుసుకుని ఊపిరి పీల్చుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు పలువురిని కంటతడి పెట్టిస్తోంది. రాసువా జిల్లాకు చెందిన మట్టి మాయా తమాంగ్ (28) అనే మహిళకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్దవాడు జోయల్ ఘలే (8). బుధవారం ఉదయం వారిద్దరూ పాఠశాలకు వెళ్లగా.. కొద్దిసేపటికే భారీ శబ్దం వినిపించడంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన తమాంగ్‌కు భయానక దృశ్యం కనిపించింది. వరద నీరు, బురద, రాళ్లు భారీగా ప్రవహిస్తూ ఆ ప్రాంతాన్ని ముంచెత్తాయి. ఇదే క్రమంలో పాఠశాల భవనాన్నీ వరద నీరు ధ్వంసం చేసింది. పిల్లలు వరదల్లో కొట్టుకుపోయి ఉంటారని భావించిన తమాంగ్.. వారిని వెతుక్కుంటూ పలు సహాయక శిబిరాలు తిరిగింది. అయినా వారి ఆచూకీ మాత్రం ఎక్కడా దొరకలేదు. దీంతో కుమారులిద్దరూ చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. అయితే చిన్నారి జోయల్ ప్రాణాలతో బయటపడ్డాడు. వరద సమయంలో ఓ స్నేహితుడితో కలిసి పాఠశాల నుంచి అడవిలోకి పారిపోయాడు. వరద నీటి నుంచి తప్పించుకునేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో అతని కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చేతులు, ముఖానికీ గాయాలయ్యాయి. గురువారం నాడు బాలుడిని గుర్తించిన పోలీసులు.. నువాకోట్ జిల్లాలోని 15 పడకల చక్ర దేవ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖాఠ్మండూ ఆస్పత్రికి తరలించారు. అయితే, ఓ జర్నలిస్టు సహాయంతో జోయల్ ఆచూకీని తమాంగ్ గుర్తించింది. వెంటనే ఆస్పత్రికి చేరుకుని కుమారుడిని కలుసుకుంది. జోయల్‌ను చూసే వరకూ అతను బతికే ఉన్నాడన్న విషయాన్ని తమాంగ్ నమ్మలేకపోయింది. ఒక్కసారిగా కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. అప్పటికే చిన్న కుమారుడు కూడా దొరకడంతో కథ సుఖాంతమైంది. 8 ఏళ్ల బాలుడు చెట్టు ఎక్కి వరదల నుంచి తప్పించుకొని సురక్షితంగా బయటపడ్డాడు. ఎట్టకేలకు రెండు రోజుల తర్వాత తన తల్లిని తిరిగి కలుసుకోగలిగాడు. నేపాల్‌కు చెందిన జోయల్ ఘలే, అతడి సోదరుడు బుధవారం పాఠశాలకు వెళ్లారు. ధాడింగ్ జిల్లాల్లో వరదల ధాటికి పలు స్కూళ్లు కొట్టుకుపోయాయి. స్థానికంగా ఉన్న ఓ చెట్టును పట్టుకొని జోయల్ ఘలే ప్రాణాలు కాపాడుకున్నాడు. ఒళ్లంతా గాయాలతో రోజంతా చెట్టుపైనే ఉండి సహాయం కోసం ఎదురు చూశాడు. అతడిని రక్షించిన సహాయక బృందాలు వైద్యం కోసం ఆస్పత్రిలో చేర్చాయి. తన ఇద్దరు కుమారుల కోసం అనేక శిబిరాల్లో వెతికినా ఎక్కడా వారి ఆచూకీ దొరక్కపోవడంతో ఆశలు వదులు కున్నానని బాలుడి తల్లి మాయా తమాంగ్ పేర్కొన్నారు. తన కుమారుడు బతికే ఉన్నట్లు అధికారుల నుంచి సమాచారం అందడంతో నమ్మలేక పోయానన్నారు. అనంతరం మరో కుమారుడిని కూడా స్థానిక అధికారులు రక్షించినట్లు తమకు సమాచారం అందిందని సంతోషం వ్యక్తం చేశారు. తమ పిల్లలను కాపాడిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# సహాయక చర్యలపై సందిగ్ధత

**ఎట్టకేలకు విదేశీ నిపుణల రాకకు నేపాల్ అంగీకారం**

ఖాఠ్మండ్,ఆగస్ట్29(ఆర్ఎన్ఎ): జలప్రళయ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు సహకరిస్తామంటూ పలు దేశాలు ముందుకురాగా.. నేపాల్ ఆ అభ్యర్థనలను తొలుత తిరస్కరించింది. ఇప్పుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. విదేశీ సహాయక బృందాలను దేశంలోకి అనుమతించేందుకు అంగీకరించింది. తమ బృందాలు సహాయక చర్యలు నిర్వహించగలవని, విదేశీ బృందాలను అనుమతించబోమని ఇటీవల నేపాల్ వెల్లడించింది. అయితే గల్లంతయిన వారిలో పలు దేశాల ప్రజలు ఉన్నారు. దాంతో సహాయక చర్యల్లో భాగం అవుతామని ఆయా దేశాల నుంచి వచ్చిన దౌత్యపరమైన ఒత్తిడి కారణంగా చివరకు నేపాల్ ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. సొరంగాల్లో రక్షణ చర్యలు చేపట్టగల సిబ్బంది, డీఎన్ఏ టెస్టింగ్, ఫోరెన్సిక్ పరీక్షలు చేయగల అంతర్జాతీయ బృందాలనే అనుమతించాలని భావిస్తోంది. నిర్దిష్ట విభాగాల్లో.. పరిమిత సంఖ్యలోనే రెస్క్యూటీమ్స్‌కు అనుమతి తెలపనున్నట్లు ప్రభుత్వ అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. పొరుగుదేశం నేపాల్‌కు భారత్ నుంచి అత్యవసర సహాయం అందుతోంది. తాజాగా 10 టన్నుల సామగ్రితో మూడో విమానం ఆ దేశంలో ల్యాండ్ అయింది. అలాగే 11 మంది బృందం కూడా వెళ్లింది. వారిలో వైద్యులు, సొరంగాల వద్ద సహాయక చర్యలు నిర్వహించగల సిబ్బంది, ఇతరులు ఉన్నారు. ఇక నేపాల్ వరదల్లో చిక్కుకున్న 84 మంది భారతీయుల్ని కాపాడారు. వారిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన 21 మంది భారత్‌కు చేరుకున్నారు. 320 మంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదని భారత ప్రభుత్వం వెల్లడించింది. ఇక ఈ విలయంలో మృతుల సంఖ్య 616కి చేరింది. 2400 మందికిపైగా గల్లంతయ్యారని నేపాల్ పోలీసులు వెల్లడించారు.

# ప్రాణాలు కాపాడి అమరుడైన పోలీస్

**చైనా బోర్డర్ పోలీస్ హువాంగ్ పెంగ్ సాహసం**

న్యూఢిల్లీ,ఆగస్ట్29(ఆర్ఎన్ఎ): నేపాల్-చైనా సరిహద్దులో బుధవారం సంభవించిన మెరుపు వరదలు పెను విధ్వంసం సృష్టించాయి. ఈ విపత్తు నుంచి పలువురిని రక్షించిన ఓ పోలీసు.. చివరికి ఆ వరదల్లోనే కొట్టుకుపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. వరద బీభత్స సమయంలో టిబెట్‌లోని గిరాంగ్ పోర్టు వద్ద సహాయక చర్యల్లో చైనా బోర్డర్ పోలీసు హువాంగ్ పెంగ్ పాల్గొన్నాడు. అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు పలువురికి సహకరించాడు. ఆ తర్వాత అదే జలప్రళయంలో కొట్టుకుపోయాడు. గిరాంగ్ పోర్టు వద్ద వరద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

# నేపాల్ వరదల్లో మరో విషాదం

**ఆచూకీ లేని ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సిఇవో**

**లక్ష్మీనాథ్ ఆచూకీ కోసం ముమ్మర గాలింపు**

న్యూఢిల్లీ,ఆగస్ట్29(ఆర్ఎన్ఎ): నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది. ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారుల తో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది.



కాగా.. నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి. ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది. అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

# స్వర్ణాంధ్ర-2047 నిర్మాణంలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలి

### ఏపీలో పెట్టుబడులు పెట్టండి.. ప్రభుత్వ పూర్తి సహకారం

### గడ్డ ఏదైనా మన మూలాలన్నీ ఆంధ్రప్రదేశ్‌వే

### మలేసియా TAM వేడుకల్లో మంత్రి కొండపల్లి







అమరావతి, ఆగస్టు 29 : స్వర్ణాంధ్ర-2047 నిర్మాణంలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. శనివారం మలేషియాలోని టామ్ 70వ ప్లాటినం జూబ్లి వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్య అతిథిగా మంత్రి కొండపల్లి పాల్గొన్నారు. మలేసియాలోని పెనాంగ్ వాటర్‌ఫ్రంట్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి మాట్లాడుతూ 1955లో చిన్న విత్తనంలా ప్రారంభమైన మలేషియా తెలుగు సంఘం నేడు 5 లక్షల మంది తెలుగు ప్రజలకు అండగా.. ఒక మహావృక్షంలా నిలబడడం ప్రశంసనీయం అని మంత్రి కొనియాడారు. ఈ 70 ఏళ్ల ఈ ప్రస్థానం ఏడు తరాల కృషికి, తెలుగు బంధానికి ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణాంధ్ర--2047 లక్ష్యంతో ముందుకు సాగుతోందని... అభివృద్ధి, పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతికత, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ.. ఇలా ప్రతి రంగంలో కొత్త అవకాశాలను సృష్టించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఏపీ ప్రభుత్వం ప్రవాసాంధ్రుల రక్షణ, సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. APNRTS ద్వారా రూ. 10 లక్షల ఉచిత ప్రమాద బీమా (గ్రాదీదీ), 24/7 హెల్ప్‌లైన్, NRI సెల్ మరియు పెట్టుబడుల కోసం 'వన్-స్టాప్ సేవలు' అందిస్తున్నామని వివరించారు. NRI సోదరుల రక్షణ, శ్రేయస్సు మరియు భాగస్వామ్యం కోసం ఒక ఎన్ఆర్టీ శాఖా మంత్రిగా ఎప్పుడు మీ కోసం అందుబాటులో ఉంటానని మంత్రి తెలిపారు.

మలేసియాలో మీరు సాధించిన వ్యాపార నైపుణ్యాలను, అనుభవాన్ని మన ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని.. ఇక్కడ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మలేషియాలో ఉన్న ఎన్ఆర్ఐ సోదరులు మలేసియా అభివృద్ధిలో భాగస్వాముల వుతూనే, మన తెలుగు గుర్తింపును విశ్వవ్యాప్తం చేశారని.. ఆంధ్రప్రదేశ్ మీ కోసం ఎప్పుడూ తలుపులు తీసి ఉంచుతుందని.. మీకు ఏ అవసరం వచ్చినా, మీ హక్కుల రక్షణకు, మీ సంక్షేమానికి మన ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. రాష్ట్రంలో రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా 6 నూతన పారిశ్రామిక విధానాలను ప్రవేశపెట్టామని... మీవీజులు, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి అమరావతి కేంద్రంగా విశాఖ, తిరుపతి, అనంతపురంలలో 'రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్లు' ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. మలేసియాలోని తెలుగు పారిశ్రామికవేత్తలు తమ అనుభవాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని, పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఆహార ప్రాసెసింగ్, తయారీ రంగం, పర్యాటకం, డిజిటల్ సేవలలో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి కొండపల్లి తెలిపారు. గడ్డ ఏదైనా... మన రక్తం తెలుగు, మన మూలాలు ఆంధ్రప్రదేశ్ అని పేర్కొంటూ, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో NRIలు భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన ప్రసంగాన్ని ముగించారు.



## స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ పీజీఆర్ఎస్

**మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజల నుంచి అర్జీల స్వీకరణ**

**అర్జీల నమోదు నుంచి పరిష్కారం వరకు నిరంతర పర్యవేక్షణ**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజల సమస్యలను సులభంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి అయిదు గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) రిజిస్టర్‌ను నిర్వహిస్తూ పంచాయతీ కార్యదర్శులు, వార్డు పరిపాలనా కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, వార్డు డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, నమోదు చేసి, నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారన్నారు. వ్యవసాయ సహాయకులు, సర్వే అసిస్టెంట్లు, రెవెన్యూ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు కూడా ఆయా సమయంలో అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ప్రతి పనిదినం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్వీకరించబడును అనే సమాచారంతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లను ఇప్పటికే ఆదేశించామన్నారు. క్యూఆర్ కోడ్ ఫీడ్‌బ్యాక్, పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజల భాగస్వామ్యంతో సేవల నాణ్యతను మెరుగుపరచాలని ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా అర్జీలను జవాబుదారీతనంతో, నాణ్యంగా పరిష్కరించేలా మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజల చెంతనే సమస్యల పరిష్కారానికి వీలుగా ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



## ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం), వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినప్పటికీ, భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి లోపాలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు.

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శనివారం కలెక్టర్ లక్ష్మీశ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను సమర్పించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులు, సిబ్బందిని సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు ఏదుపాటి రామయ్య (తెదేపా), పి.గోవింద (భాజపా), బి.మురళీకృష్ణ (ఐఎన్సీ), జిడగం శ్రీనివాస్ (జేఎస్పీ) పాల్గొన్నారు.




## ఆర్థిక పరిజ్ఞానంతో మహిళా సాధికారతకు కొత్త దిశ!

**అవగాహనతో అడుగులు వేస్తూ విజయాలను అందుకోండి.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నారని... అయితే మహిళలు వ్యాపారాలను ప్రారంభించడం మాత్రమే కాకుండా, వాటిని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం చాలా ముఖ్యమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో ఫిక్కీ ఎఫ్ఎల్‌వో విజయవాడ చాప్టర్ సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారతలో ఆర్థిక అక్షరాస్యత పోషించే కీలక పాత్రను ఫిక్కీ ఎఫ్ఎల్‌వో విజయవాడ చాప్టర్ ఛైర్‌పర్సన్ సుప్రియా మల్లినేని సమక్షంలో సంస్థ ట్రెజరర్, సీఏ తుల్జా భవానీ వివరించారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్, ఆదాయపు పన్ను, జీఎస్టీ, వ్యాపారానికి సంబంధించిన ఇతర చట్టపరమైన అంశాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం ముఖ్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థిక అంశాలపై పట్టుద్వారా వ్యాపారాలను మరింత విజయవంతంగా విస్తరించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ వ్యాపారంలో పెట్టుబడి పెట్టడం, ఆదాయాన్ని పెంచుకోవడం ఎంత ముఖ్యమో, వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా నిర్వహించడం, ఖర్చులను నియంత్రించడం, పొదుపు చేయడం, భవిష్యత్ అవసరాలకు ప్రణాళిక రూపొందించడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఆర్థిక అక్షరాస్యత కలిగిన మహిళలు తమ వ్యాపారంలో లాభనష్టాలను అంచనా వేసుకోవడంతో పాటు, సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఆర్థికంగా అవగాహన కలిగిన మహిళలు కుటుంబ ఆర్థిక వ్యవహారాల్లోనూ, వ్యాపార నిర్ణయాల్లోనూ మరింత ఆత్మవిశ్వాసంతో వ్యవహరించగలుగుతారని తెలిపారు. ఆర్థిక స్వాతంత్ర్యం మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు కుటుంబ స్థిరత్వానికి, పిల్లల భవిష్యత్‌కు, వ్యాపార అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళా వ్యాపారవేత్తలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, రైజ్ మేనేజర్ బి.తేజస్విని పాల్గొన్నారు.

## దివ్యాంగుల స్వావలంబనకు ప్రగతి చక్రాలు!

**విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశలి**

విభిన్న ప్రతిభావంతులు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా తమ పనులు చేసుకునేందుకు, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మోటరైజ్డ్ త్రిచక్ర వాహనాలు ఎంతో దోహదపడతాయని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు పాల్గొని 58 మందికి రూ. 66.70 లక్షలు విలువైన స్కూటర్లను అందించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ దివ్యాంగులకు ఈ వాహనాలు ఉద్యోగాలు, వ్యాపారాలు, స్వయం ఉపాధి, ఇతర జీవనోపాధి కార్యకలాపాలకు సులభంగా వెళ్లేందుకు ఉపయోగపడతాయని అన్నారు. రోజువారీ అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. వాహనం కేవలం రాకపోకలకు మాత్రమే కాకుండా దివ్యాంగుల స్వావలంబనకు, ఆత్మవిశ్వాసానికి, జీవనోపాధికి ఒక సాధనంగా నిలుస్తాయన్నారు.

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శారీరక వైకల్యం కలిగిన అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా రిట్రోఫిట్ చేసిన మోటరైజ్డ్ వాహనాలను అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు సులభమైన రాకపోకలు, స్వయం సమృద్ధి, గౌరవప్రదమైన జీవనం, స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 113 దరఖాస్తులు అందగా జిల్లా ఎంపిక కమిటీ ప్రభుత్వ మార్గదర్శకాలు, అర్హత ప్రమాణాల మేరకు దరఖాస్తులను పరిశీలించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఎంపికైన 58 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కటి రూ. 1.15 లక్షల విలువైన మోటరైజ్డ్ త్రీ వీలర్ వాహనాలను సమకూర్చినట్లు తెలిపారు.కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి వాడ్రేవు కామరాజు తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యలకు భూభారతితో పరిష్కారం

**భూమిపై పట్టా రైతుకు సంపూర్ణ న్యాయహక్కు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**నల్లగొండ, ఆగస్టు 29:**

రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు భూభారతి ద్వారా శాశ్వత పరిష్కారం చూపేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శనివారం సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానికంగా తొమ్మిది గ్రామాల్లో దశాబ్దాలుగా పరిష్కారం కాని భూ సమస్యలకు పరిష్కారం లభించడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఒక రైతుకు భూమిపై పట్టా లభిస్తే ఆ భూమిపై సంపూర్ణ న్యాయపరమైన హక్కు లభించినట్లేనని, అలాగే ఒక పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు లభిస్తే వారి గౌరవం, ఆత్మగౌరవం పునరుద్ధరించబడినట్లేనని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ గృహ పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, దేశంలోనే ఇది అపూర్వమైన సంక్షేమ చర్య అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా పథకాన్ని ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 'గుడిసెలు లేని తెలంగాణ' నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల భారాన్ని ఎదుర్కొంటూనే రూ.20 వేల కోట్ల రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధుల జమ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీపై సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) కింద రూ.36 వేల కోట్ల విలువైన రహదారి అభివృద్ధి పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు పాల్గొన్నారు.




# దేశ ఆరోగ్య రంగంలో అద్భుతమైన మార్పులు

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

గత దశాబ్ద కాలంలో దేశంలో ఆరోగ్య మౌలిక వసతులు, వైద్య విద్య, ప్రజలకు అందుబాటు ధరల్లో చికిత్స అందించే రంగాల్లో విశేషమైన పురోగతి సాధించామని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో నిర్వహించిన 'కిడ్నీ సింపోజియం-2026'లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కిడ్నీ సంరక్షణ, అవయవ మార్పిడి, అధునాతన వైద్య చికిత్సల్లో యశోద ఆస్పత్రి రీనల్ సైన్సెస్ విభాగం అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. 2014లో దేశంలో 387 వైద్య కళాశాలలు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 846కు పెరిగిందన్నారు. ఎంబీబీఎస్ సీట్లు 51,348 నుంచి సుమారు 1.4 లక్షలకు పెరిగాయని తెలిపారు. ఎయిమ్స్ సంస్థల సంఖ్య కూడా ఏడు నుంచి 23కు పెరిగిందన్నారు. దేశవ్యాప్తంగా 1.86 లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రజలపై వైద్య ఖర్చుల ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందన్నారు. 20 వేలకుపైగా జన ఔషధి కేంద్రాల ద్వారా నాణ్యమైన జనరిక్ మందులను తక్కువ ధరలకు అందిస్తున్నట్లు తెలిపారు. మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతుండటంపై కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి మూత్రపిండాలు, గుండె సహా ఇతర కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధులను కేవలం చికిత్సతోనే కాకుండా నివారణ, క్రమం తప్పని పరీక్షలు, ముందస్తు గుర్తింపు ద్వారా ఎదుర్కోవాలని సూచించారు. ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం కింద 32 లక్షలకు పైగా రోగులకు నాలుగు కోట్లకు పైగా ఉచిత హీమో డయాలసిస్ సెషన్లు అందించామని తెలిపారు. తద్వారా కుటుంబాలకు వైద్య ఖర్చుల్లో రూ.10 వేల కోట్లకు పైగా ఆదా అయిందన్నారు. జాతీయ అసంక్రమిత వ్యాధుల కార్యక్రమం కింద అధిక రక్తపోటు, మధుమేహం కోసం ఒక్కో విభాగంలో 41 కోట్ల మందికి పైగా పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. డిజిటల్ ఆరోగ్య రంగం కూడా వేగంగా విస్తరించిందని, 96 కోట్లకు పైగా 'ఆభా' ఖాతాలు రూపొందించడంతో అనుసంధానిత ఆరోగ్య సేవలకు బలమైన పునాది ఏర్పడిందన్నారు. కిడ్నీ వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని పిలుపునిచ్చారు. రక్తపోటు, రక్తంలో చక్కెరను నియంత్రణలో ఉంచుకోవడంతో పాటు అవసరం లేకుండా నొప్పి నివారణ మందులను వాడకూడదని సూచించారు. ప్రజల క్రియాశీల భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వ పథకాలు మాత్రమే విజయవంతం కాలేవన్నారు. దేశంలో అవయవ దానం, అవయవ మార్పిడి వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అవయవదానం రోగికి కొత్త జీవితాన్ని ప్రసాదించగల 'అత్యున్నత బహుమతి' అని అభివర్ణించారు. 'ప్రపంచ ఫార్మసీ హబ్'గా పేరొందిన హైదరాబాద్ అధునా తన వైద్యం, వైద్య పరిశోధన, మెడికల్ వ్యాల్యూ టూరిజం లోనూ ప్రధాన కేంద్రంగా ఎదుగు తోందన్నారు. సింపోజియంలో పాల్గొన్న వైద్యులు, పరిశోధకులు, ఆరోగ్య రంగ నిపుణులను కిషన్‌రెడ్డి అభినందించారు.



# యువ క్రికెటర్లకు కార్పొరేట్ రంగం అండగా నిలవాలి




**బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్ పిలుపు**

**హైదరాబాద్, ఆగస్టు 29:**

దేశంలో యువ క్రికెట్ ప్రతిభను అభివృద్ధి చేసేందుకు కార్పొరేట్ రంగం మరింత చురుగ్గా ముందుకు రావాలని బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మాజీ కెప్టెన్ వి. చాముండేశ్వరనాథ్ పిలుపునిచ్చారు. యువ ఆటగాళ్లు ఎదుర్కొనే ఆర్థిక లోటును భర్తీ చేయడం, గ్రామీణ స్థాయి క్రీడా మౌలిక వసతులకు సహకరించడం, క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే యువతకు భద్రత కల్పించడం అవసరమన్నారు. బీసీసీఐ మద్దతుతో తెలంగాణలో తొలిసారిగా నిర్వహించిన టీజీ20 క్రికెట్ టోర్నమెంట్ విజేత హైదరాబాద్ ఈ-చాంపియన్స్ జట్టుకు హైదరాబాద్ తాజ్ డెక్కన్‌లో నిర్వహించిన ఘన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ జట్టు 11 మ్యాచ్‌ల్లో 10 విజయాలు సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించిన ట్రూజోన్ సోలార్ పవర్ సంస్థ ఆటగాళ్లను సన్మానించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడంలో కార్పొరేట్ సహకారం అత్యంత కీలకమని చాముండేశ్వరనాథ్ అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ట్రూజోన్ సోలార్ గణనీయమైన కృషి చేస్తోందని, హైదరాబాద్ జట్టుకు మరో మూడు సంవత్సరాలు స్పాన్సర్‌షిప్ కొనసాగించాలని సంస్థ నిర్ణయించిందని తెలిపారు. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలనూ ప్రోత్సహించాలని సంస్థ భావిస్తోందన్నారు. ప్రముఖ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ ట్రూజోన్ సోలార్‌లో పెట్టుబడిదారులుగా ఉన్నారని పేర్కొన్నారు. ట్రూజోన్ సోలార్ పవర్ మేనేజింగ్ డైరెక్టర్ చారుగుండ్ల భవాని సురేష్ హైదరాబాద్ ఈ-చాంపియన్స్ జట్టును అభినందించారు. క్రీడా ప్రతిభను ప్రోత్సహించడాన్ని సంస్థ కొనసాగిస్తుందని తెలిపారు. ఆటగాళ్లు పోటీపడి విజయం సాధించి చాంపియన్లుగా నిలిచారని, ఈ విజయోత్సవం వారికోసమేనన్నారు. తెలంగాణతో పాటు ఇతర తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించి, క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలనుకునే వారికి సహకారం అందిస్తామని భవాని సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ట్రూజోన్ సోలార్ సీఈఓ జక్కుల శ్రీనివాస్, హైదరాబాద్ ఈ-చాంపియన్స్ కెప్టెన్ అభిజిత్ రెడ్డి, వైస్ కెప్టెన్ అజయ్ దేవ్ గౌడ్, జట్టు సభ్యులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మారథాన్‌తో ఆదివారం ట్రాఫిక్ మళ్లింపులు

**ఉదయం 4.30 నుంచి 9.30 గంటల వరకు ఆంక్షలు**

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

హైదరాబాద్ రన్నర్స్ మారథాన్ నేపథ్యంలో ఆదివారం ఆగస్టు 30న తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఉదయం 9.30 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద ప్రారంభమయ్యే మారథాన్ ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్, సోమాజిగూడ, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, రోడ్ నంబర్ 45, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీదుగా గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద ముగుస్తుంది. మారథాన్ సాగుతున్న తీరును బట్టి నల్లగుట్ట, వీవీ స్టాచ్యూ, కేపీసీ, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్, అంబేద్కర్ విగ్రహం, చిల్డ్రన్స్ పార్క్, కవాడిగూడ క్రాస్‌రోడ్, గ్రీన్‌ల్యాండ్స్ జంక్షన్, ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్, ఎన్టీఆర్ భవన్, జర్నలిస్ట్ కాలనీ తదితర ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తారు. సైబరాబాద్ వైపు నుంచి రోడ్ నంబర్ 45, కేబుల్ బ్రిడ్జి వైపు వచ్చే వాహనాలకు కూడా ఆంక్షలు ఉంటాయి. వాటిని జూబ్లీహిల్స్‌లోని ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లిస్తారు. ట్రాఫిక్ రద్దీ, ప్రయాణ ఆలస్యాన్ని నివారించేందుకు ఉదయం 4.30 నుంచి 9 గంటల మధ్య మారథాన్ మార్గాన్ని వీలైనంత వరకు నివారించి ప్రత్యామ్నాయ రహదారులను వినియోగించాలని పోలీసులు ప్రజలకు సూచించారు. అత్యవసర ప్రయాణ సహాయం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ హెల్ప్‌లైన్ 9010203626ను సంప్రదించవచ్చని తెలిపారు.

# ప్రాణహిత నుంచి సుందిళ్లకు 80 టీఎంసీలు గ్రావిటీతో తరలించే అవకాశం

**తెలంగాణ-మహారాష్ట్ర చర్చలపై మంత్రి ఉత్తమ్ ఆశాభావం**

**హైదరాబాద్, ఆగస్టు 29:**

తెలంగాణ, మహారాష్ట్ర మధ్య కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న అంతర్రాష్ట్ర చర్చలు ఫలిస్తే ప్రాణహిత నుంచి సుందిళ్ల బ్యారేజీకి దాదాపు 80 టీఎంసీల నీటిని గ్రావిటీ ద్వారా తరలించే అవకాశం ఏర్పడుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో జరగనున్న చర్చల్లో తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత బ్యారేజీని 150 మీటర్ల పూర్తి జలాశయ స్థాయితో నిర్మించాలన్న తెలంగాణ ప్రతిపాదనపై చర్చించనున్నారు. కేంద్ర జల సంఘం చైర్మన్ అధ్యక్షతన సమావేశం జరగనుండగా, సీడబ్ల్యూసీకి చెందిన కీలక డైరెక్టరేట్ల అధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొంటారు. చర్చలకు ముందు శనివారం నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజనీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు, ఇతర సీనియర్ అధికారులతో ఉత్తమ్‌కుమార్ రెడ్డి సన్నాహక సమావేశం నిర్వహించారు. రెండు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభమవడం కీలక ముందడుగని మంత్రి పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా మొదట ప్రతిపాదించిన ప్రయోజనాలను తిరిగి సాధించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ నిరంతరం చేసిన ప్రయత్నాలు, ఉత్తర ప్రత్యుత్తరాల ఫలితంగానే ఈ చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. 2016లో గత రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన 148 మీటర్ల స్థాయికి బదులుగా, దానికంటే రెండు మీటర్లు ఎక్కువైన 152 మీటర్ల స్థాయికి మహారాష్ట్ర సమ్మతి పొందేందుకు తెలంగాణ ప్రయత్నిస్తుందని ఉత్తమ్ తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహించిన సాంకేతిక అధ్యయనాల ప్రకారం 148 మీటర్ల స్థాయిలో మహారాష్ట్రలో సుమారు 1,150 ఎకరాలు, 152 మీటర్ల స్థాయిలో 2,500 ఎకరాలకు పైగా భూమి ముంపునకు గురవుతుందని మంత్రి చెప్పారు. రెండు స్థాయిల్లోనూ ముంపు ఉండే నేపథ్యంలో సాంకేతికంగా ప్రయోజనకరమైన 152 మీటర్ల స్థాయికి మహారాష్ట్ర సమ్మతి పొందేందుకు గత ప్రభుత్వం మరింత సమర్థంగా చర్చలు జరిపి ఉండాల్సిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను తగినంతగా పరిరక్షించకుండా 148 మీటర్లకు అంగీకరించడం వల్ల తెలంగాణ ఒక ముఖ్యమైన అవకాశాన్ని కోల్పోయిందని వ్యాఖ్యానించారు. బ్యారేజీ స్థాయి పెరిగితే దాదాపు 80 టీఎంసీల నీటిని సుందిళ్లకు గ్రావిటీ ద్వారా తరలించవచ్చని తెలిపారు. తద్వారా అధిక వ్యయం, విద్యుత్ వినియోగం అవసరమయ్యే ఎత్తిపోతల సాగునీటి వ్యవస్థపై ఆధారపడటం తగ్గుతుందన్నారు. గ్రావిటీ ద్వారా నీటి తరలింపు మరింత విశ్వసనీయమైన, సుస్థిర సాగునీటి వనరును అందిస్తుందని పేర్కొన్నారు.

# సాంకేతికత, శిక్షణతో తెలంగాణ పోలీసింగ్‌కు కొత్త దిశ

**ఏఐ, డేటా ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి: డీజీపీ సి.వి. ఆనంద్**

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

మారుతున్న నేర ధోరణులను ముందుగానే ఎదుర్కొనేందుకు తెలంగాణ పోలీసులు సాంకేతికత, కృత్రిమ మేధస్సు, డేటా ఆధారిత పోలీసింగ్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్ సూచించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం సీనియర్ పోలీస్ అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్‌ఎస్), ఇంటర్‌ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్)ను అన్ని విభాగాలు సమర్థంగా అమలు చేస్తూ క్రమం తప్పకుండా నవీకరించాలని ఆదేశించారు. ఎన్‌సీఎల్, ఈ-సాక్ష్య, ఈ-ఫోరెన్సిక్స్, ఐసీజేఎస్ అనుసంధానంతో పాటు జాతీయ పోలీసింగ్ పోర్టళ్లలో తెలంగాణ పనితీరును ఆయన సమీక్షించారు. సాంకేతిక ఆధారిత అప్లికేషన్ల వినియోగాన్ని పెంచాలని, డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలను ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులకు సూచించారు. కోర్టు కేసుల నిర్వహణపై మరింత శ్రద్ధ పెట్టాలని, చట్టపరమైన విధానాలను కచ్చితంగా పాటించాలని డీజీపీ పేర్కొన్నారు. దర్యాప్తు, కోర్టు విధానాలు, న్యాయపరమైన అంశాల్లో క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వడం పోలీసు వ్యవస్థలో అంతర్భాగం కావాలని స్పష్టం చేశారు. జిల్లా, నగర శిక్షణ కేంద్రాలు, పోలీస్ ట్రైనింగ్ కాలేజీలు, బెటాలియన్లు, పోలీస్ అకాడమీ నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు కొత్తగా ఎదురవుతున్న పోలీసింగ్ సవాళ్లకు అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. వివిధ నేర నియంత్రణ ప్రమాణాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన విభాగాల సిబ్బందిని ఈ సందర్భంగా సన్మానించారు. క్లస్టర్-1లో హైదరాబాద్, క్లస్టర్-2లో రామగుండం, క్లస్టర్-3లో నల్లగొండ, క్లస్టర్-4లో సూర్యాపేట అత్యుత్తమ పనితీరు కనబరిచాయి. సంబంధిత బృందాలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతర్గత సామర్థ్యం, పర్యవేక్షణ, ప్రజా సేవలను మెరుగుపరిచేందుకు ఏఐ ఆధారిత అప్లికేషన్లు, ఇతర సాంకేతిక ఆవిష్కరణలు రూపొందించిన యువ ఐపీఎస్ అధికారులను డీజీపీ అభినందించారు. మరిన్ని వినూత్న కార్యక్రమాలతో ముందుకు రావాలని సూచించారు. 2013 బ్యాచ్, అంతకంటే సీనియర్ ఐపీఎస్ అధికారుల కోసం నిర్వహించిన నాయకత్వ సెషన్‌లో ముందు ఉండి నాయకత్వం వహించడం, నైతికత, బృందస్ఫూర్తి ప్రాధాన్యాన్ని ఆనంద్ వివరించారు. మారుతున్న నేర ధోరణులను ఎదుర్కొనేందుకు అన్ని పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సాంకేతికత, డేటా ఆధారిత నేర విశ్లేషణ, వృత్తిపరమైన శిక్షణ, మానవ వనరుల సమర్థ వినియోగం కలిస్తే తెలంగాణ పోలీసు వ్యవస్థ మరింత సమర్థవంతంగా, ప్రజలకు వేగంగా స్పందించే వ్యవస్థగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. సమావేశంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, ఆర్‌బీవీఆర్‌ఆర్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, మహిళా భద్రతా విభాగం డీజీ చారు సిన్హా, ఈగిల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# అక్టోబర్ చివరి నాటికి తొలి విడత రీ సర్వే పూర్తి చేయాలి




**పేదలకు రూ.230కే సిమెంట్ బస్తా**

**అధికారుల పనితీరుతో రెవెన్యూ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరగాలి**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

సూర్యాపేట, ఆగస్టు 29:

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో చేపట్టిన రీ సర్వేకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో రెండో విడత సర్వే చేపట్టేందుకు ఇప్పటి నుంచే సంసిద్ధం కావాలని సూచించారు. రీ సర్వే ద్వారా రెవెన్యూ రికార్డులు పూర్తిస్థాయిలో ప్రక్షాళన అవుతాయని, తద్వారా 90 శాతానికి పైగా భూ సమస్యలు పరిష్కారమ వుతాయని పేర్కొన్నారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. దశాబ్దాలుగా గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింద న్నారు. అధికారులు చిత్తశుద్ధితో, పారదర్శకంగా చట్టాన్ని అమలు చేయాలని సూచించారు. భూ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి పరిష్కరించడం ద్వారా రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలని చెప్పారు. 70 గ్రామాల్లో పకడ్బందీగా రీ సర్వే తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో రీ సర్వేను పార దర్శకంగా నిర్వహించడంతో పాటు గ్రామ సరిహద్దుల నిర్ధారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని నిర్దేశించిన గడువుకంటే ముందుగానే సర్వే పూర్తి చేయాలని చెప్పారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవే క్షించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదన్నారు. రెవె న్యూ, అటవీ భూములకు సంబంధించిన వివా దాలను కూడా చట్ట పరిధిలో శాశ్వతంగా పరిష్క రించేందుకు సమస్యలను గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. సర్వే కోసం నియ మించిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థా యిలో వినియోగించుకోవాలని, విధులకు హాజరుకాని వారిని అవసరమైతే తొలగించి లైసెన్సులు రద్దు చేయాలని స్పష్టం చేశారు. సర్వేయర్ల కొరత ఉన్న ప్రాంతాల్లో పక్క మండ లాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేయాలని సూచించారు. సర్వే పూర్తయిన రోజే సంబంధిత రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదే శించారు. 15 రోజుల్లో ఎల్-3 సమస్యలు పరిష్కరించాలి ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో తలెత్తిన ఎల్-1, ఎల్-2, ఎల్-3 సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి ఆదే శించారు. ముఖ్యంగా 15 రోజుల్లో ఎల్-3 సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. రెండో విడత ఇళ్ల మంజూరు సమయంలో ఇటువంటి సమస్యలు పునరా వృతం కాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసు కోవాలని, ఇందుకు శాసనసభ్యులు కూడా సహకరించాలని కోరారు. మంజూరు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇంటికి ఒక బిల్లు చెల్లించి తదుపరి బిల్లులను నిలిపివేస్తే సంబం ధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేదలు ఇందిరమ్మ ఇళ్లను తక్కువ వ్యయంతో నిర్మించుకునేందుకు అన్ని పన్నులు, రవాణా చార్జీలతో కలిపి సిమెంట్ బస్తాను రూ.230కే అందించేలా సిమెంట్ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందానికి వచ్చిందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. దసరాలోపు అసంపూర్తి ఇళ్లు పూర్తి చేయాలి గత ప్రభుత్వం చేపట్టి వివిధ దశల్లో అసంపూర్తిగా మిగిలిపో యిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గుర్తించి 15 రోజుల్లో వాటిపై కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఇందిరమ్మ తొలి విడతలో చేపట్టి అసంపూర్తిగా ఉన్న ఇళ్లను కూడా దసరాలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నల్గొండ పట్టణంలో 'ఇందిరమ్మ టవర్స్' పేరుతో 500 గృహాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సమీప ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ఇసుకను లబ్ధిదారులకు అందించేలా కలెక్ట ర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. గతం లో ఇంటి పట్టాల కోసం భూములను గుర్తించి ఇప్పటికీ పంపిణీ చేయని ప్రాంతాల జాబితా రూపొందించి వెంటనే పంపిణీ చేపట్టాలని చెప్పారు. తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పని తీరులో స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు ఎక్కడా ఉండకూడదని మంత్రి హెచ్చరించారు. భూములకు సంబంధించిన 45 దరఖాస్తులను తన లాగిన్‌లో ఎక్కువ రోజులుగా పెండింగ్‌లో ఉంచిన యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూ డూరు తహసీల్దార్‌ను వివరణ కోరాలని ఆదేశిం చారు. పేదలకు ఇల్లు ఎంతో ముఖ్యం: కోమటిరెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ భూభారతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంద న్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తొలి విడతలో మిగిలిపోయిన ఇందిరమ్మ ఇళ్లు, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను దసరాలోపు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులను కోరారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 సమస్యలను పరిష్కరించడంతో పాటు నల్గొండలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి ద్వారా పేదలకు సంబంధించిన వాస్తవ భూ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఇందిరమ్మ ఇళ్ల ఎల్-3 సమస్యలను పరిష్కరించాలని, నకిరేకల్‌కు మంజూరైన జిల్లా కోర్టు విషయంలో చర్యలు వేగవంతం చేయాలని కోరారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎల్-3 సమస్యల పరిష్కారంలో కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడ రిజిస్ట్రేషన్ కార్యాలయం, అడవిదేవులపల్లి మండలంలో తహసీల్దార్ కార్యాలయం మంజూరు చేయడంతో పాటు మిర్యాలగూడకు ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు శాలిగౌరారం మండలం మాదారం చెరువు శిఖం భూముల ఆక్రమణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక సమస్యను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ సాదాబైనామాల పరిష్కారంలో లింక్ డాక్యుమెంట్లు అడుగుతున్న అంశంతో పాటు ఆర్ఓఎఫ్ఆర్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ముగ్గు పోసుకున్న అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సాదాబైనామాల సమస్యల పరిష్కారం, నక్షా మ్యాపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎల్-3 నిబంధనలను సరళీకరించాలని కోరారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి తన నియోజకవర్గంలోని ఆర్అండ్ఆర్ సమస్యలతో పాటు అటవీ, అసైన్డ్ భూముల పట్టాదారులకు న్యాయం చేయాలని కోరారు. గ్రామసభలకు ఉన్నతాధికారులు హాజరుకావాలి

సమావేశం ప్రారంభంలో రెవెన్యూ సీసీఎల్ఏ కార్యదర్శి లోకేష్ కుమార్, ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్ తమ శాఖలకు సంబంధించిన అంశాలను వివరించారు. సమీక్షలో భాగంగా సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాలకు చెందిన పలువురు తహసీల్దార్లతో మంత్రి నేరుగా మాట్లాడి రీ సర్వే పురోగతి, క్షేత్రస్థాయి సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న అభిప్రాయాలను తెలుసుకున్నారు. రీ సర్వేకు సంబంధించిన గ్రామసభలకు ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, జిల్లా కలెక్టర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తమ జిల్లాల్లో చేపట్టిన చర్యలను మంత్రులకు వివరించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.



## తెలంగాణలో పెట్టుబడులకు మారిషస్ ఆసక్తి

**మంత్రి శ్రీధర్‌బాబుతో మారిషస్ మంత్రి లుచ్మనేన్ పెథియా భేటీ**

హైదరాబాద్, ఆగస్టు 29:

తెలంగాణతో ప్రభుత్వ పరిపాలన, పర్యాటకం, ఐటీ, ఐటీ ఆధారిత సేవలు, ఆధునిక సాంకేతికతలు, నైపుణ్యాభివృద్ధి, విద్య తదితర రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు మారిషస్ ఆసక్తి వ్యక్తం చేసింది. మారిషస్ పబ్లిక్ సర్వీస్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ మంత్రి లుచ్మనేన్ పెథియా శనివారం సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిశారు. ఇరువురు మంత్రులు వివిధ రంగాల్లో తెలంగాణ-మారిషస్ సహకార అవకాశాలపై చర్చించారు. తెలంగాణను తమ దేశం విశ్వసనీయ భాగస్వామిగా భావిస్తోందని పెథియా తెలిపారు. సామర్థ్య పెంపుదల, ఆధునిక పరిపాలనా విధానా ల్లో తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి ఉందన్నారు. శిక్షణ, విజ్ఞాన మార్పిడి కార్యక్రమాల ద్వారా మారిషస్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెం పొందించేందుకు తెలంగాణ సహకారం కోరారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు తెలంగాణలోని ఇతర విద్యా, నైపుణ్యాభివృద్ధి సంస్థలతో కలిసి పనిచే యాలని తమ ప్రభుత్వం కోరుకుం టోందన్నారు. మారిషస్‌కు అన్ని రంగాల్లో సహకారం అందించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ నున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనాలని పెథియాను ఆహ్వానించారు. సమావేశంలో మారిషస్ పబ్లిక్ సర్వీస్ కార్యదర్శి దేవేంద్ర గోపాల్, అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ అండ్ ఇన్నోవేషన్ బోర్డు చైర్‌పర్సన్ డాక్టర్ నికోలస్ రగోడూ, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ దుర్బారీ, విదేశాంగ శాఖ బ్రాంచ్ సెక్రటేరియట్ అధిపతి మాధవ్ ఆర్. సుల్ఫులే, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ అండ్ ఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతాంగానికి తీరని అన్యాయం

**కృష్ణా, గోదావరి జలాలను వృథా చేస్తున్నారు రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ధ్వజం**

సూర్యాపేట, ఆగస్టు 29 :




రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వల్ల ఏర్పడిన కరువు కాదని, ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఏర్పడిన కృత్రిమ కరువని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. చేపట్టబోయే నిరసన కార్యక్రమాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో జగదీశ్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతోందని ఆయన విమర్శించారు. రైతులు తమ సమస్యలను ఎంతగా మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. "ఇది కాలం వల్లనో, ఎల్‌నినో ప్రభావం వల్లనో వచ్చిన కరువు కాదు. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కరువే" అని పేర్కొన్నారు. రైతాంగం పట్ల ఇంతటి నిర్లక్ష్యపూరిత పాలనను గతంలో చూడలేదన్నారు. 150 టీఎంసీల గోదావరి జలాలు సముద్రం పాలు కృష్ణా, గోదావరి జలాల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను బీఆర్ఎస్ ప్రజల ముందుం చుతోందని జగదీశ్ రెడ్డి చెప్పారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు బాగున్నాయని కేంద్ర జల సంఘమే స్పష్టం చేసిందని పేర్కొన్నారు. అయినప్పటికీ గత 75 రోజుల్లో గోదావరిలో సుమారు 150 టీఎంసీల నీటిని సముద్రంలోకి వృథాగా వదిలేశారని ఆరోపించారు. కృష్ణా నదిలోనూ సుమారు 150 టీఎంసీల నీరు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయిందని అన్నారు. శ్రీశైలం, ప్రాజెక్టులు పొంగిపొర్లే స్థాయిలో కృష్ణా నదికి నీరు వచ్చినప్పటికీ తెలంగాణ రైతాంగానికి అవసరమైన నీటిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనధికారిక ఉత్తర్వులతో నీటిని తరలించుకుపోయిందని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితోనే జరుగుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ఒత్తిడి కారణంగానే నాగార్జు నసాగర్ గేట్ల నుంచి కొంతమేర నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. ఎడమ కాలువ రైతులకు నీళ్లెందుకు ఇవ్వరు? అధికారులే రైతులను ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచిస్తున్నారని, అయితే సాగునీరు ఎంత మేరకు అందిస్తారనే విషయాన్ని ఏ మంత్రి స్పష్టంగా చెప్పడం లేదని జగదీశ్ రెడ్డి విమర్శించారు. నాగార్జునసాగర్ కుడి కాలువకు నీరు ఇస్తూ ఎడమ కాలువకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఈ ప్రాంత రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారని ఆరోపించారు. విత్తనాలు, ఎరువులు, విద్యుత్, పంటలకు బోనస్ వంటి అంశాల్లో రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము చేస్తున్నవి రాజకీయ ఆరోపణలు కాదని, రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న పరిస్థితులనే ప్రజల ముందుకు తీసుకొస్తున్నామని చెప్పారు. "కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టడమే రైతులు చేసిన పాపమా?" అని ప్రశ్నించిన జగదీశ్ రెడ్డి, రైతాంగానికి న్యాయం జరిగే వరకు కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


# కృష్ణా, గోదావరి జలాలను వృథా చేస్తున్నారు రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ధ్వజం**

సూర్యాపేట, ఆగస్టు 29 :

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వల్ల ఏర్పడిన కరువు కాదని, ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఏర్పడిన కృత్రిమ కరువని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. చేపట్టబోయే నిరసన కార్యక్రమాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో జగదీశ్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతోందని ఆయన విమర్శించారు. రైతులు తమ సమస్యలను ఎంతగా మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. "ఇది కాలం వల్లనో, ఎల్‌నినో ప్రభావం వల్లనో వచ్చిన కరువు కాదు. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కరువే" అని పేర్కొన్నారు. రైతాంగం పట్ల ఇంతటి నిర్లక్ష్యపూరిత పాలనను గతంలో చూడలేదన్నారు. 150 టీఎంసీల గోదావరి జలాలు సముద్రం పాలు కృష్ణా, గోదావరి జలాల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను బీఆర్ఎస్ ప్రజల ముందుం చుతోందని జగదీశ్ రెడ్డి చెప్పారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు బాగున్నాయని కేంద్ర జల సంఘమే స్పష్టం చేసిందని పేర్కొన్నారు. అయినప్పటికీ గత 75 రోజుల్లో గోదావరిలో సుమారు 150 టీఎంసీల నీటిని సముద్రంలోకి వృథాగా వదిలేశారని ఆరోపించారు. కృష్ణా నదిలోనూ సుమారు 150 టీఎంసీల నీరు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయిందని అన్నారు. శ్రీశైలం, ప్రాజెక్టులు పొంగి పొర్లే స్థాయిలో కృష్ణా నదికి నీరు వచ్చినప్పటికీ తెలంగాణ రైతాంగానికి అవసరమైన నీటిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనధికారిక ఉత్తర్వులతో నీటిని తరలించుకుపోయిందని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితోనే జరుగుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ఒత్తిడి కారణంగానే నాగార్జు నసాగర్ గేట్ల నుంచి కొంతమేర నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. ఎడమ కాలువ రైతులకు నీళ్లెందుకు ఇవ్వరు? అధికారులే రైతులను ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచిస్తున్నారని, అయితే సాగునీరు ఎంత మేరకు అందిస్తారనే విషయాన్ని ఏ మంత్రి స్పష్టంగా చెప్పడం లేదని జగదీశ్ రెడ్డి విమర్శించారు. నాగార్జునసాగర్ కుడి కాలువకు నీరు ఇస్తూ ఎడమ కాలువకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఈ ప్రాంత రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారని ఆరోపించారు. విత్తనాలు, ఎరువులు, విద్యుత్, పంటలకు బోనస్ వంటి అంశాల్లో రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము చేస్తున్నవి రాజకీయ ఆరోపణలు కాదని, రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న పరిస్థితులనే ప్రజల ముందుకు తీసుకొస్తున్నామని చెప్పారు. "కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టడమే రైతులు చేసిన పాపమా?" అని ప్రశ్నించిన జగదీశ్ రెడ్డి, రైతాంగానికి న్యాయం జరిగే వరకు కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


## మరో పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం

**నియోజకవర్గాలు 183కు పెరిగితే 120 సీట్లు గెలుస్తాం: కోమటిరెడ్డి**

సూర్యాపేట, ఆగస్టు 29:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో పదేళ్లపాటు అధికారంలో కొనసాగుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం సూర్యాపేట జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 183కు పెరిగితే కనీసం 120 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. "183 అసెంబ్లీ స్థానాలు ఏర్పడితే వాటిలో కనీసం 120 స్థానాలు గెలుస్తామనే విశ్వాసం మాకు ఉంది. ఇది కేవలం మా మాట కాదు. ప్రజల్లో ప్రస్తుతం కనిపిస్తున్న స్పందన ఆధారంగానే ఈ విశ్వాసం ఏర్పడింది" అని మంత్రి పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన ఆకాంక్షను నెరవేర్చిన మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పట్ల తెలంగాణ ప్రజలు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలనే భావనతో ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలుస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన పనులను ప్రజలకు తెలియజేయడానికి భారీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పనితీరు గురించి అడిగితే ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలే చెబుతారని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణలో సమగ్ర విత్తన చట్టం

**రైతుల రక్షణ, నాణ్యమైన విత్తన సరఫరానే లక్ష్యం: మంత్రి తుమ్మల**

హైదరాబాద్, ఆగస్టు 29:రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, నాణ్యమైన విత్తనాల సరఫరాను నిర్ధారించడం లక్ష్యంగా సమగ్ర విత్తన చట్టాన్ని త్వరితగతిన తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కోసం తెలంగాణ మరింతకాలం వేచి ఉండబోదని స్పష్టం చేశారు. ప్రతిపాదిత 'విత్తన చట్టం-2025'పై శనివారం సచివాలయంలో వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.



# పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం

**ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

సూర్యాపేట, ఆగస్టు 29

పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సూర్యాపేట పట్టణంలోని 34వ వార్డుకు చెందిన దాస్యం అనూష నూతన గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోతు భాస్కర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు సొంత గూడు కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. సొంత ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబం జీవితకాల స్వప్నమని, ఆ కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన దాస్యం అనూష కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 34వ వార్డు కాంగ్రెస్ నాయకులు సాజిద్ (నీడ్స్), అంజద్, జమీర్, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధునాతన పదార్థాల పరిశోధనపై ఎంజీఐటీలో వర్క్‌షాప్

హైదరాబాద్, ఆగస్టు 29:

పదార్థాల లక్షణ నిర్ధారణకు ఉపయోగించే ఎక్స్‌రే డిఫ్రాక్షన్ (ఎక్స్‌ఆర్‌డీ), స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ (ఎస్‌ఈఎం), డెన్సిటీ ఫంక్షనల్ థియరీ (డీఎఫ్‌టీ) ఆధారిత సిమ్యులేషన్‌పై గండిపేటలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లో శనివారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంజీఐటీ ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ విభాగం, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఏఎస్) సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొని పదార్థాల పరిశోధనలో అధునాతన సాంకేతిక పద్ధతులను అధ్యయనం చేశారు. వైస్ ప్రిన్సిపాల్, గౌరవ అతిథి ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌లు పరిశోధనా విధానాలపై ప్రాయోగిక అనుభవం, ప్రత్యక్ష అవగాహన కల్పిస్తాయని అన్నారు. టీఏఎస్ జోనల్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ బి.ఎన్. రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో పరిశోధకులు, విద్యార్థులు నిరంతరం తమ జ్ఞానాన్ని నవీకరించుకోవాలని సూచించారు. టీఏఎస్ కార్యదర్శి, ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ మౌలిక పరిశోధనలకు విద్యాసంస్థల స్థాయిలోనే పునాదులు పడతాయని తెలిపారు. అధ్యాపకులు తమ సంస్థల్లో పరిశోధనలను బలోపేతం చేయడంతో పాటు జాతీయ స్థాయి పరిశోధనలకు కూడా తోడ్పడాలని పిలుపునిచ్చారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో సుమారు 100 మంది ఆన్‌లైన్‌లో, మరో 60 మంది ప్రత్యక్షంగా పాల్గొన్నారు. హైదరాబాద్ డీఎంఆర్ఎల్ శాస్త్రవేత్త డాక్టర్ ఆశిష్ పాఠక్ డెన్సిటీ ఫంక్షనల్ థియరీ, దాని అనువర్తనాలపై మాట్లాడగా, హైదరాబాద్ ఏఆర్‌సీఐ శాస్త్రవేత్త డాక్టర్ కె. సురేష్ ఎక్స్‌ఆర్‌డీ ఆధారిత రీట్‌వెల్డ్ రిఫైన్‌మెంట్‌పై సాంకేతిక సెషన్ నిర్వహించారు. వర్క్‌షాప్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎ.కె. సింగ్ మాట్లాడుతూ శాస్త్రీయ, సాంకేతిక పరిశోధనల పురోగతిలో పదార్థాలు, వాటి లక్షణ నిర్ధారణ పద్ధతులకు బహుళశాఖల ప్రాధాన్యం ఉందన్నారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ బి. వేణుగోపాల్‌రావు వందన సమర్పణ చేశారు.

# సకాలంలో వర్షాల కోసం తిరుమలలో ఐదు రోజుల వరుణ యజ్ఞాలు

తిరుమల, ఆగస్టు 29:

సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, మానవాళికి శ్రేయస్సు కలగాలని కోరుతూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 3 వరకు వరుణ యజ్ఞం, పర్జన్య శాంతి, కారీరి ఇష్టి యజ్ఞాలు సహా పలు వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆగస్టు 30 సాయంత్రం 6.30 గంటలకు అంకురార్పణతో ఐదు రోజుల కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం రాత్రి 7 నుంచి 8 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం నిర్వహిస్తారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వరుణ యజ్ఞం, కారీరి ఇష్టి, పర్జన్య శాంతి హోమాలు నిర్వహిస్తారు. వీటితో పాటు వేద పారాయణాలు, రామాయణంలోని సుందరకాండ, విరాటపర్వం, రిష్యశృంగ ధ్యానం, పారాయణ కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఏడు వేద శాఖలకు చెందిన పండితులతో అగ్నిహోత్ర అనుష్ఠానం, వేద పారాయణం నిర్వహిస్తారు. ఇదే సమయంలో గోగర్భం డ్యామ్ వద్ద వరుణ, పర్జన్య మంత్ర అనుష్ఠానం జరుగుతుంది. సెప్టెంబర్ 3 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయి.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**బకాయిల చెల్లింపులో ప్రభుత్వం విఫలం: బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి**

**సూర్యాపేటలో బీజేవైఎం ఆధ్వర్యంలో 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' నిరసన దీక్ష**



సూర్యాపేట, ఆగస్టు 29:

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి డిమాండ్ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ వద్ద 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' పేరుతో నిరసన దీక్ష నిర్వహించారు. చల్లా శ్రీలత రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, రంగరాజు రుక్మారావు, బొబ్బ భాగ్యరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలు చెల్లించాల్సి ఉందని వారు పేర్కొన్నారు. బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అధ్యాపకులకు వేతనాలు, భవనాల అద్దెలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అనేక డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ తదితర కళాశాలలు ఆర్థిక ఇబ్బందులతో మూతపడే పరిస్థితికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడం వల్ల చదువు పూర్తిచేసిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లు పొందడంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కళాశాలలకు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల మధ్య ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడటం సరికాదని, ఇచ్చిన హామీలను అమలు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతుందని హెచ్చరించారు. బకాయిల విడుదలలో ప్రభుత్వం మరింత జాప్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ నిరసన దీక్షకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సంఘీభావం ప్రకటించాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పాదూరి కరుణ, తుక్కాని మన్మథ రెడ్డి, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు బూర మల్సూర్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు పృథ్వీ గౌడ్, ఉపాధ్యక్షుడు భరత్ నాయుడు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కంచర్ల నరసింహ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నాగేంద్ర చారి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బొజ్జ పరశురాం, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సక్రు నాయక్, జిల్లా నాయకులు చల్లమల్ల నరసింహ, పాండురంగాచారి, కందుల రమేష్, మంజుల, కోడి లింగయ్య, దాసరి వెంకన్న, బాలాజీ నాయక్, యాదగిరి, కిరణ్, రవి నాయక్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేపచెట్టు వివాదం.. రెండు ప్రాణాలు బలి

**ఎర్రగడ్డ తండాలో ఇరువర్గాల ఘర్షణ --- గొడ్డళ్లతో పరస్పర దాడులు**

**మంద వెంకటేశ్వర్లు యాదవ్, సైదా మృతి --- గ్రామంలో ఉద్రిక్తత**

**ఘర్షణను అడ్డుకునే క్రమంలో ఎస్సై నవీన్‌కుమార్‌కు గాయాలు**



మేళ్లచెరువు, ఆగస్టు 29 :

మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసి రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఇరువర్గాలు గొడ్డళ్లతో పరస్పరం దాడులకు దిగడంతో మంద వెంకటేశ్వర్లు యాదవ్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సైదాను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సమాచారం. ఘటనతో ఎర్రగడ్డ తండాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఘటన అనంతరం ఆగ్రహానికి గురైన గ్రామస్తులు పెద్దబాబు కుటుంబంపై దాడికి దిగినట్లు సమాచారం. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మేళ్లచెరువు ఎస్సై నవీన్ కుమార్‌కు కూడా గాయాలైనట్లు తెలిసింది. పోలీసులు గ్రామంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. చెట్టు కోసం రెండు ప్రాణాలా? ఒక వేపచెట్టు విషయంలో మొదలైన వివాదం చివరకు రెండు ప్రాణాలను బలిగొనే స్థాయికి చేరడం సమాజంలో పెరుగుతున్న అసహనం, ఆవేశం, విచక్షణారాహిత్యానికి నిదర్శనం. స్థానికంగా అందుతున్న సమాచారం ప్రకారం వేపచెట్టును నరకాలా, వద్దా అనే అంశం చుట్టూ వివాదం మొదలై చివరకు హింసాత్మక ఘర్షణగా మారింది. చెట్టు పవిత్రమైనదనే విశ్వాసమైనా, ఆస్తి వివాదమైనా, వ్యక్తిగత విభేదమైనా--- ఏ కారణమూ మనిషి ప్రాణం కంటే గొప్పది కాదు. చిన్నపాటి వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోలేక ఆయుధాలతో ఒకరిపై మరొకరు దాడులకు దిగడం నాగరిక సమాజానికే వెక్కిరింత. శాస్త్రసాంకేతిక రంగాల్లో సమాజం ముందుకు వెళుతున్నప్పటికీ మూఢవిశ్వాసాలు, ఆవేశాలు, వ్యక్తిగత కక్షలు మనిషి విచక్షణను కమ్మేస్తే అభివృద్ధికి అర్థం ఉండదు. ఒక చెట్టు వివాదం రెండు కుటుంబాలను విషాదంలోకి నెట్టడం అత్యంత దురదృష్టకరం. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి అసలు వివాదానికి కారణాలు, దాడులకు బాధ్యులెవరు అనే విషయాలను తేల్చాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో గ్రామాల్లో చిన్న చిన్న వివాదాలు హింసాత్మకంగా మారకుండా సామాజిక చైతన్యం, శాస్త్రీయ దృక్పథం, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునే సంస్కృతి పెరగాల్సిన అవసరాన్ని ఎర్రగడ్డ తండా ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. "చెట్టు కోసం రెండు ప్రాణాలా?" అనే కోణాన్ని బాక్స్ ఐటమ్‌గా పేజీలో పెడితే వార్తకు మరింత ప్రభావం వస్తుంది.

# ప్రమాద బాధితుల చికిత్సలో వేగం.. సమన్వయమే కీలకం

**ఉస్మానియా ఆస్పత్రిలో ట్రామా కేర్‌పై వైద్య విద్యా కార్యక్రమం**



హైదరాబాద్, ఆగస్టు 29:

ప్రమాద బాధితుల చికిత్సలో పద్ధతిబద్ధమైన, బహుళ వైద్య విభాగాల సమన్వయంతో కూడిన, కాలపరిమితికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చే విధానం అవసరమని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ ట్రామా కేర్ (ఐటీసీ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ట్రామా కేర్‌పై ఒకరోజు కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ట్రామా నిపుణులు, పీజీ విద్యార్థులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రమాద బాధితుడి ప్రాథమిక అంచనా, ఆస్పత్రికి చేరకముందు ఎదురయ్యే సమస్యలు, డ్యామేజ్ కంట్రోల్ రీససిటేషన్, శస్త్రచికిత్స, శ్వాసనాళ నిర్వహణ, పెల్విక్, కంటి గాయాలు, క్రిటికల్ కేర్ తదితర అంశాలపై సెషన్లు నిర్వహించారు. తలకు గాయం, తొడ ఎముక విరిగినట్లు రూపొందించిన నమూనా ట్రామా రోగిపై ప్రాథమిక, ద్వితీయ ట్రామా సర్వేలను ప్రత్యక్షంగా ప్రదర్శించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమర్జెన్సీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్, ఆర్థోపెడిక్స్, ట్రామా సర్జరీ, అనస్థీషియాలజీ, క్రిటికల్ కేర్, ఆఫ్తాల్మాలజీ నిపుణులు పాల్గొన్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఐటీసీ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు, ఈఎంఆర్ఐ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జి.వి. రమణరావు ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ఐటీసీ హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ ఆశిమా శర్మ అకడమిక్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఉన్న ప్రజలు, అత్యవసర వైద్య సేవలు, ఆస్పత్రులు, స్పెషలిస్టు వైద్య బృందాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని నిపుణులు సూచించారు. వృత్తిపరమైన వైద్య సహాయం చేరే వరకు ప్రమాద బాధితులకు సహాయం చేస్తూ ప్రజలు 'రాహ్-వీర్స్' లేదా 'గుడ్ సమారిటన్స్'గా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా శిక్షణ, సిమ్యులేషన్ ఆధారిత అభ్యాసం నిర్వహిస్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సంసిద్ధత, చికిత్స ఫలితాలు మెరుగుపడతాయని డాక్టర్ రమణరావు అన్నారు. తెలంగాణలోని వైద్య కళాశాలలు, ఇతర సంస్థలకు పద్ధతిబద్ధమైన ట్రామా కేర్ శిక్షణను విస్తరించాలని ఐటీసీ హైదరాబాద్ చాప్టర్ భావిస్తోందని డాక్టర్ ఆశిమా శర్మ తెలిపారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలలు, ఆరోగ్య సంస్థల్లో 'కాంప్రెహెన్సివ్ ట్రామా లైఫ్ సపోర్ట్' కోర్సులు నిర్వహించనున్నట్లు చాప్టర్ ప్రకటించింది. బహుళ వైద్య విభాగాల భాగస్వామ్యంతో రాష్ట్ర ట్రామా కేర్ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపింది.

# ప్రారంభానికి సిద్ధమైన మూసారాంబాగ్ కొత్త వంతెన

**రూ.52 కోట్లతో మూసీపై నిర్మాణం**



హైదరాబాద్, ఆగస్టు 29:

మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై కొత్తగా నిర్మించిన వంతెన త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శనివారం వంతెనను పరిశీలించారు. ట్రాఫిక్ అనుసంధానాన్ని మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో రూ.52 కోట్ల అంచనా వ్యయంతో వంతెనను నిర్మించారు. మొత్తం 400 మీటర్ల పొడవు, 14.5 మీటర్ల వెడల్పుతో వంతెనను నిర్మించారు. మూసీ నదిపై వాహనాలు సులభంగా, సమర్థంగా ప్రయాణించేలా దీన్ని రూపొందించారు. పాదచారులు సురక్షితంగా, సౌకర్యవంతంగా నడిచేందుకు 3.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. వంతెనతో పాటు అప్రోచ్ రోడ్లు, అనుబంధ మౌలిక వసతులను కమిషనర్ పరిశీలించి, వాహనాల రాకపోకలకు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. అప్రోచ్ రోడ్లు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ దీపాలు, పాదచారుల సౌకర్యాలు, ఇతర తుది పనులన్నీ ప్రారంభానికి ముందే నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త వంతెనతో అంబర్‌పేట-మూసారాంబాగ్ మధ్య రవాణా అనుసంధానం గణనీయంగా మెరుగుపడి, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రస్తుతం ఉన్న మార్గాలపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెండింగ్ పనులను ప్రాధాన్యంగా పూర్తి చేసి వంతెనను ప్రజలకు సురక్షితంగా, సాఫీగా అందుబాటులోకి తేవాలని కమిషనర్ సూచించారు.




# ది ప్యారడైజ్ నుంచి పాట

## 'యెష నాగుల కట్ట మీద' విడుదల..

### మాస్ బీట్‌తో ఆకట్టుకుంటున్న గీతం

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రం నుంచి రెండో పాటగా ప్రముఖ జానపద గీతం 'యెష నాగుల కట్ట మీద'ను తాజాగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబిం బించే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ శైలిలో రూపొందించారు. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ఈ పాటపై ఆసక్తి పెరుగుతుండగా.. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ అందించిన మాస్ బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 'దసరా' విజయం తర్వాత నాని నుంచి వస్తున్న మరో మాస్ చిత్రంగా 'ది ప్యారడైజ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా.. జంగి రెడ్డి, గాయని ప్రభ తమ గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. సినిమాలో నాని వేసే మాస్ నృత్యాలు పాటకు మరింత ప్రత్యేకతను తీసుకురానున్నాయని చిత్రబృందం చెబుతోంది. ఎస్.ఎల్.వి. సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'ది ప్యారడైజ్' ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబరు 24, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. కొత్త పాటతో సినిమాపై అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.



# ఆసక్తిగా తదుపరి ప్రాజెక్ట్

'ఇరుముడి' సినిమాతో మరోసారి దర్శకుడిగా తన ప్రతిభను చాటుకున్న శివ నిర్వాణ తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఆయన తదుపరి సినిమా ఎవరితో ఉండబో తుందనే విషయంలో ప్రస్తుతం మూడు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, నటుడు ధనుష్‌తో పాటు అక్కినేని నాగ చైతన్య పేరు కూడా పరిశ్రమ వర్గాల్లో చర్చకు వస్తోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ఎప్ప టినుంచో నేరుగా తెలుగు సినిమా చేయాలనే ఆసక్తితో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. శివ నిర్వాణ భావోద్వేగ కథ లను తెరకె క్కించే విధానం, దర్శకత్వ ప్రతిభపై సూర్యకు మంచి అభిప్రా యం ఉందని సినీ వర్గాల్లో ప్రచా రం జరుగుతోంది. సూర్య వ్యక్తి త్వానికి, తెరపై ఆయన కని పించే తీరుకు సరిపోయే బలమైన కథ సిద్ధమైతే వీరిద్దరి కలయికలో సినిమా ప్రారంభ మ య్యేఅవకా శంఉందని సమాచా రం. మరోవైపు నటుడు ధనుష్ పేరు కూడా శివ నిర్వాణ తదుపరి ప్రాజెక్ట్ విషయంలో వినిపిస్తోంది.




# 'టాక్సిక్'కు తగ్గిన ఆదరణ

రాకింగ్ స్టార్ యశ్ నటించిన భారీ చిత్రం 'టాక్సిక్'కు విడుదలకు ముందు భారీ అంచనాలు ఉన్నప్పటికీ.. విడుదల తర్వాత ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించలేదని సమాచారం. సినిమా కథనం, పాత్రల రూపకల్పన, చిత్రీకరణపై విమర్శలు రావడంతో వసూళ్లు తగ్గుముఖం పట్టినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

ముఖ్యంగా ఐమ్యాక్స్ తెరలపై ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో కొన్ని థియేటర్లలో 'టాక్సిక్' ప్రదర్శనలను తగ్గించి, ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ రూపొందించిన 'ది ఒడిస్సీ' చిత్రానికి ఎక్కువ ప్రదర్శనలు కేటాయిస్తున్నట్లు సమాచారం.

విడుదలైన తొలి రోజుల్లో 'టాక్సిక్'కు మంచి ఆదరణ కనిపించినప్పటికీ.. రోజులు గడుస్తున్న కొద్దీ ప్రేక్షకుల సంఖ్య తగ్గినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు 'ది ఒడిస్సీ' చిత్రానికి ప్రేక్షకుల ఆసక్తి పెరగడంతో టికెట్ల ముందస్తు విక్రయాలు కూడా ఊపందుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పలు ఐమ్యాక్స్ తెరలపై 'ది ఒడిస్సీ' ప్రదర్శనలకు ప్రాధాన్యం లభిస్తోంది.

# హనుమాన్ అంశ్ జోరు




బాలీవుడ్‌లో భారీ బడ్జెట్ చిత్రాల హవా కొనసాగుతున్న వేళ.. చిన్న భక్తి ప్రధాన చిత్రం 'హనుమాన్ అంశ్' అనూహ్య విజయాన్ని అందుకుంటోంది. తొలి రెండు వారాల్లో నెమ్మదిగా సాగిన ఈ సినిమా.. మూడో వారం నుంచి ఒక్కసారిగా పుంజుకుని సినీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. విడుదలైన తొలి రెండు వారాల్లో 'హనుమాన్ అంశ్'కు పెద్దగా ఆదరణ లభించలేదు. కొత్త చిత్రాలకు తెరలు కేటాయించడంతో ఈ సినిమాకు ప్రదర్శనలు కూడా తగ్గిపోయాయి. తొలి రెండు వారాల్లో సుమారు రూ. 1.5 కోట్ల నికర వసూళ్లు మాత్రమే వచ్చినట్లు అంచనా. అయితే సినిమాకు సానుకూల స్పందన రావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా ప్రేక్షకుల మధ్య ప్రచారం ఈ చిత్రానికి కలిసొచ్చింది.



# ..ఆ తర్వాత కనుమరుగు!

సుధీర్‌బాబు హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన 'ప్రేమకథ చిత్రం' సినిమా అప్పట్లో ఘన విజయం సాధించింది. 2013లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ హారర్ కామెడీ చిత్రంలో నందితా రాజ్ కథానాయికగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సప్తగిరి, ప్రవీణ్ కామెడీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవగా.. నందితా రాజ్ తన నటనతో పాటు అందంతోనూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'ప్రేమకథ చిత్రం' విజయంతో నందితా రాజ్‌కు వరుస అవకాశాలు వస్తాయని, ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదుగుతారని అప్పట్లో సినీ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే అనూహ్యంగా ఆమెకు అవకాశాలు తగ్గిపోయాయి. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. తేజ దర్శకత్వంలో తెరకెక్కిన 'నీకు నాకు డాష్ డాష్' సినిమాతో కథానాయికగా పరిచయమైన నందితా రాజ్.. 'ప్రేమకథ చిత్రం'తో ఒక్కసారిగా ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అనంతరం సుధీర్‌బాబుతో కలిసి 'కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ' సినిమాలో నటించారు. అయితే ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'జై లవకుశ' చిత్రంలో చిన్న పాత్రలో కనిపించారు.



# దీపిక వ్యాఖ్యలపై దుమారం

బాలీవుడ్ నటి దీపికా పదుకొనే ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. తన సినీ ప్రయాణంలో ప్రభాస్ కంటే ఎక్కువ సినిమాలు చేశానని, విజయాల విషయంలోనూ తనకంటూ ప్రత్యేక స్థానం ఉందనే అర్థం వచ్చేలా ఆమె మాట్లాడినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రభాస్ అభిమానులు, నెటిజన్ల నుంచి భిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. భారతీయ సినీ పరిశ్రమలో ప్రభాస్‌కు భారీ అభిమానగణం ఉంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వరుస భారీ చిత్రాలతో ఆయన తన మార్కెట్‌ను విస్తరించుకున్నారు. అలాంటి ప్రభాస్‌తో తనను పోల్చుకుంటూ దీపిక వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం కావడంతో కొందరు అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467